ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 9 ఆగస్టు 2025

**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| అనంతపురం, రాప్తాడు, శింగనమల | :9985411608 |
| తాడిపత్రి, | : 7659062646, |
| గుంతకల్లు, ఉరవకొండ, | : 9985411657, |
| కళ్యాణదుర్గం, | :9701120019, |
| రాయదుర్గం, | : 9000406723, |

ఏసీఎమ్: 9985411154

## వరాల తల్లికి విశేష పూజలు

● జిల్లావ్యాప్తంగా వరలక్ష్మీపూజలు, వ్రతాలు


కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలందుకుంటున్న వరలక్ష్మీమాత



అనంతపురంలోని ఐదోరోడ్డు కనకదుర్గాభవాని దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, శివకోటి ఆలయంలో...

అనంతపురం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతం చేసే సంప్రదాయం లేనివారు సమీప ఆలయాల్లో నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉదయాన్నే వాసవీమాతకు పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ఐదో రోడ్డులోని కనకదుర్గ దేవాలయంలోనూ వరలక్ష్మీ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి సుప్రభాత సేవ చేశారు. మూలవిరాట్‌కు పసుపు కుంకుమలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, చౌడేశ్వరి దేవాలయం, పాతూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, మహాలక్ష్మి ఆలయం, రామ్‌నగర్‌లోని పెద్దమ్మ దేవాలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లోనూ విశేష పూజలు నిర్వహించారు.


హరిహర దేవాలయంలో.. లలితా పరమేశ్వరి


చెరువుకట్ట నిమిశాంబ దేవాలయంలో గజలక్ష్మీ అలంకరణ


పూజల్లో పాల్గొన్న మహిళలు

## నీకు నేను.. నాకు నీవు రక్ష

● నేడు రాఖీ పౌర్ణమి



ఒక కొమ్మకు పూచిన పువ్వులై
సుంగంధ పరిమళాలు వెదజల్లి
ఒక ఇంటన వెలిగే దివ్వెలై
కారు చీకట్లను తొలగించి
అనురాగానికి చిరునామాగా
ఆత్మీయతకు ఆలంబనగా
అమ్మనాన్నల నీడన ఎదిగి
జీవిత పర్యంతం
ఒకరికొకరు రక్షగా ఉండే రాగ బంధం
అన్నా, చెల్లెలు, అక్కాతమ్ముడు
అనుబంధం
పున్నమి వెన్నెలలా హాయిని
గొలుపుతూ
కన్నవారి ఇంటిని బృందావనం చేసే
సూత్రం... రక్షా బంధనం
బంధాలు, బాధ్యతల కలబోతగా
భారతీయులు జరుపుకునే
రాఖీ పౌర్ణమి నేడు

6


అనంతపురంలో రాఖీ కొనుగోలు చేస్తున్న ముస్లిం మహిళ



# ముడుపులిస్తేనే మోక్షం..!

## రెవెన్యూశాఖలో హెచ్చుమీరిన అక్రమాలు

● సబ్‌డివిజన్ చేయాలంటే రూ.2లక్షలివ్వాలట
● ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో మాయాజాలం
● లబోదిబోమంటున్న బాధితులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ప్రతి పనికీ ఓ రేటు పెట్టారు. మాన్యువల్ డెత్ సర్టిఫికెట్ నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వరకు డిమాండ్‌ను బట్టి వసూలు చేస్తుంటారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలు లేకుండా ఏవైనా సర్టిఫికెట్లు, పత్రాలు తీసుకోవడం కుదరదనే విమర్శలున్నాయి. సర్వే కోసం వెళ్లినా ముడుపులు చెల్లించాల్సిందే. డైక్లాట్‌లో వివరాల కోసం పైసలు ముట్టజెప్పాల్సిందే. ఇలాంటి పనులకు ఎంతో కొంత ఇస్తే చాలు పనైపోతుందని సామాన్యులు సైతం అంటున్నారంటే పరిస్థితి ఎంత ముదిరిపోయింతో అర్థం చేసుకోవచ్చు. ఇక సబ్ డివిజన్ చేసుకోవాలంటే సర్వేయర్‌ను, రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకోవడం సామాన్యుడికి తలకు మించిన భారం అవుతోంది. ఉన్నతాధికారులకు ఈ వ్యవహారం తెలిసినా చర్యలు తీసుకోకపోవడం వల్లనే

(మిగతా 6వ పేజీలో...)


ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్

### పైసలిస్తేనే ఫ్యామిలీ సర్టిఫికెట్

ఏదైనా భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించుకునే క్రమంలో కావాల్సిన పత్రాలు, సర్టిఫికెట్లలో ప్రధానమైంది ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్(ఎఫ్ఎంసీ). ఈ సర్టిఫికెట్ రావాలంటే నెలపైగా ఎదురుచూడాల్సి ఉంటుంది. పైసలు ముట్టజెబితే త్వరగానే చేతిలోకి వచ్చేస్తుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్‌ఓ నుంచి ఆర్‌ఐ వరకు సంబంధిత పత్రాలు పరిశీలిస్తారు. ఈ సర్టిఫికెట్ కోసం డిమాండ్‌ను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇక సరైన ఆధారాలు లేకుండా, గిమ్మిక్కులు చేయాలంటే మాత్రం పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ రూ.లకారాల్లో పలుకుతోందట. మూడు నెలల కిందట అనంతపురం పరిధిలో కీలకమైన పోస్టులో ఉండే ఓ రెవెన్యూ ఉద్యోగి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఏకంగా రూ.2లక్షలు వసూలు చేశాడట. ఈ విషయంపై అధికారపార్టీ ప్రజాప్రతినిధి తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఇతను పైసలు లేనిదే ఫైల్స్ ముట్టడనే ఆరోపణలున్నాయి.

## వంద రోజుల్లోనే వండర్

● హంద్రీనీవా వెడల్పు పనులపై మంత్రి కేశవ్


నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి

ఉరవకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేవలం వందరోజుల్లోనే హంద్రీనీవా వెడల్పు పనులు పూర్తి చేసి, కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేసినట్లు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు పంప్‌హౌస్ వద్ద నీటి పంపింగ్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎన్ని పంపులు రన్ చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాగులపాడు లిఫ్ట్ నుంచి 8 నుంచి 10 పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలోపే 6 మోటర్ల నుంచి 12 మోటార్లు వాడుకునేలా కాలువను రెండింతల సామర్థ్యానికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతుల నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా పని చేశామన్నారు. 2019కంటే ముందు జగన్మోహన్‌రెడ్డి జల దీక్షకు వచ్చి అధికారంలోకి వచ్చిన నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని చెప్పి, తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. హంద్రీనీవా నీటితో పీఏబీఆర్ డ్యాంను నింపుతామన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూటర్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నూతేటి వెంకటేష్, టీడీపీ నాయకులు గోనుగుంట్ల నాగేంద్ర, వలి, వన్నూరుస్వామి, మనోజ్, చాబాల ఎర్రిస్వామి, హెచ్ఎన్ఎస్ ఏఈ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిగుస్తున్న ఉచ్చు..!

దాల్‌మిల్ సూరి సోదరుల కోసం పోలీసుల వేట

(వివరాలు 7లో..)

## ‘డబ్బు’ల్ రిజిస్ట్రేషన్

● డాక్టర్‌తో రూ.60లక్షలు అప్పు తీసుకున్న యజమాని
● చెల్లించలేక దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించిన వైనం
● తాజాగా మరొకరికి కూడా.. నిలదీసిన బాధితులు

7లో

## సమస్యల గురుకులం..!

● వేధిస్తున్న తరగతి గదుల కొరత ● ఆరు బయటే స్నానాలు, భోజనాలు
● కన్నెత్తిచూడని పాలకులు, అధికారులు
● ఇబ్బందుల్లో విద్యార్థులు

(వివరాలు 6లో...)


తరగతి గదిలోనే నిద్రిస్తున్న విద్యార్థులు

## వడ్డీ వ్యాపారుల ఆట కట్టించండి

● ఎస్పీ ఆఫీస్ ఎదుట సీపీఐ ధర్నా

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ వ్యాపారుల ఆటకట్టించాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. పాతూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి లో బంగారు షాపులో పనిచేస్తున్న మైనార్టీ యువకుడిపై వడ్డీ వ్యాపారులు దాడి చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పోలీసుల వైఫల్యమని విమర్శించారు. బుక్కరాయసముద్రానికి చెందిన ఆటోడ్రైవర్ బాలకృష్ణ ఉదంతం, సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి రూ.35వేల రుణానికి రూ.1.2లక్షల వడ్డీ చెల్లించి, ఆత్మహత్య ఘటనలు వడ్డీ వ్యాపారుల దారుణాలకు నిదర్శనాలన్నారు. వడ్డీ మాఫియా నగరంలో రోజురోజుకీ చెలరేగిపోతోందన్నారు. అధిక వడ్డీ మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు లింగమయ్య, రమణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, పార్వతి, పద్మావతి, రాజేష్, కుళ్లాయిస్వామి, కృష్ణుడు, అల్లీపీరా, ఎల్లుట్ల నారాయణస్వామి, బంగారు బాషా, రాజుప్రసాద్, యశోదమ్మ, శ్రీనివాస్, మంజునాథ్, ఆనంద్ పాల్గొన్నారు.



ఎస్పీ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు


అనంతపురంలోని రామ్‌నగర్‌లో రోడ్డుపై భారీగా వర్షం నీరు.. వాహనదారుల ఇక్కట్లు..

## దంచికొడుతున్న వాన

ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్/కొత్తచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వాన దంచికొట్టింది. అనంతపురం, పుట్లూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. రాయదుర్గం, నార్పల, తాడిపత్రి, బొమ్మనహాళ్, బెళుగుప్ప తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 7 మండలాల్లో గురువారం రాత్రి వర్షం (మిగతా 7వ పేజీలో..)

## ఏ వంకన పూడ్చేది..?

అంత్యక్రియలు చేయాలంటే వంక దాటాల్సిందే

వజ్రకరూరు(ఉరవకొండ), ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): శవాన్ని పూడ్చడానికి కూడా వజ్రకరూరు మండలంలోని పొట్టిపాడు గ్రామ దూదేకుల కులస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీరికి సంబంధించిన శ్మశానవాటిక వంక అవతల ఉంది. అందులో ఎప్పుడూ నడుములోతు నీళ్లు ఉంటాయి. దీంతో గ్రామంలో ఎవరైనా తమ కులస్థులు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి దూదేకుల కులస్థులు అగచాట్లు పడుతున్నారు. గ్రామంలో ఉన్న 15 దూదేకుల కుటుంబాల వారు చాలా ఏళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. శుక్రవారం కూడా ఇమామ్‌కాసీం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు నానా అవస్థలు పడ్డారు. నడుములోతు నీళ్లలోనే, వంకలోనుంచి అవతలి వైపునకు వెళ్లాల్సి వచ్చింది. శ్మశానానికి స్థలం కేటాయించి, దారి ఏర్పాటు చేయాలని దూదేకుల కులస్థులు కోరుతున్నారు.


మృతదేహాన్ని వంకలో తీసుకెళ్తున్న దృశ్యం




స్నేహితులతో కలిసి మొక్క నాటుతున్న నవని (స్కూల్ యూనిఫాంలో ఉన్న చిన్నారి)

# అవని కోసం నవని..!

## చిన్నారి పర్యావరణ ప్రేమ

### 257 మొక్కలు నాటిన అనంత బాలిక

- 3 వేల మొక్కల పంపిణీ
- వాటి సంరక్షణకు చర్యలు
- కేంద్ర మంత్రి ప్రశంసలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మూడో తరగతి చదువుతున్న బాలిక పర్యావరణ పరిరక్షణకు కదిలింది. మొక్కలు నాటుతూ, వాటిని పరిరక్షిస్తూ అందరి మన్ననలు పొందుతోంది అనంతపురానికి చెందిన నవని. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మా కె నామ్ (తల్లి పేరుతో మొక్క నాటుదాం) అంటూ ఇచ్చిన పిలుపు పట్ల ఆకర్షితురాలై మొక్కలు నాటడంతో పాటు ఉచితంగా వాటిని పంపిణీ చేస్తోంది. ఇప్పటివరకు 257 మొక్కలు నాటి వాటిని స్వయంగా పరిరక్షిస్తోంది. 3 వేల మొక్కలు పంపిణీ చేసి, వాటిని ఎక్కడెక్కడ నాటారనే అంశాలపై తరచూ ఆరా తీస్తూ వాటి పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తోంది.

మూడో తరగతి బాలిక.
పసి వయసులోనే
పర్యావరణంపై ప్రేమ పెంచుకుంది.
భూమి పరిరక్షణకు
చిరు ప్రయత్నం మొదలెట్టింది.
పచ్చదనం పెంచేందుకు కదిలింది.
వందల మొక్కలు నాటింది..
వాటిని పరిరక్షిస్తోంది.. వేలల్లో
పంపిణీ చేసింది..
అవి ఎలా ఉన్నాయని ఆరాతీస్తోంది..
పచ్చని చెట్లపై ఎంత
పిచ్చి ప్రేమో..
ఆ పసి
పాపకి..



నవనిని అభినందిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

### నరేంద్ర మోదీ పిలుపుతో..

నగరానికి చెందిన అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, కల్పన దంపతుల ఏకైక కుమార్తె నవని. అనంతపురంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో మూడో తరగతి చదువుతోంది. తండ్రి సుంకర రమేష్ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి పొందింది. చిన్నతనంలోనే సేవాబాట పట్టింది. మొక్కల పరిరక్షణకు అనువుగా, అవకాశం ఉండే ప్రాంతాలను ఎంచుకుంటోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కుల్లో మొక్కలు నాటడం మొదలెట్టింది. పండుగలు, సెలవు రోజుల్లో మొక్కలు నాటుతోంది.

### కేంద్ర మంత్రుల అభినందనలు

చిన్నారి నవని చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. నవని మొక్కలు నాటడం, ఉచితంగా పంపిణీ చేయడంపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను కేంద్రప్రభుత్వం గుర్తించింది. నవనిని మేరా సర్కార్ అధికారులు ఢిల్లీకి ఆహ్వానించారు. అక్కడికెళ్లి నవని చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అవనిని కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి సతీష్‌చంద్ర దూబే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, టీడీపీ పార్లమెంటు ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు. ఏక్ పేడ్ మా కె నామ్ అమలులో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థులతో ప్రధానమంత్రి మోదీ నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమంలో నవని పాల్గొననుంది. చిన్న వయసులో ఢిల్లీ స్థాయిలో గుర్తింపు పొందిన నవనిని అందరూ అభినందిస్తున్నారు.



# ముడుపులిస్తేనే మోక్షం..!

(5వ పేజీ తరువాయి)

మరింత రెచ్చిపోతున్నారన్న విమర్శలున్నాయి.

### సబ్ డివిజన్ చేయాలన్నా..

సబ్ డివిజన్ కోసం అధికారులకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. జిల్లా అంతటా అన్ని మండలాల్లో ఇదే వ్యాపారం సాగుతోంది. గార్లదిన్నె తహసీల్దారు కార్యాలయంలో అంతా తానై వ్యవహరిస్తున్న ఓ అధికారి సబ్‌డివిజన్ కోసం పెద్దగానే డిమాండ్ చేస్తున్నారట. ఆ మండలంలోని శిరివరం గ్రామానికి చెందిన షబ్బీర్ అలీ సబ్‌డివిజన్ కోసం తహసీల్దార్ కార్యాలయం వెళ్లాడు. శిరివరంలోని సర్వేనెంబరు 217లో 3.50 ఎకరాల భూమిని ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా గతంలో మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించి, పాస్‌బుక్కు అందజేశారనేది బాధితుని ఆరోపణ. ఈ నేపథ్యంలో కోర్టు పరిధిలో ఉన్న 3.5 ఎకరాలు మినహాయించి తమకు చెందిన 14 ఎకరాలు సబ్ డివిజన్ చేయాలని కోరాడు. ఇందుకు సంబంధిత అధికారి రూ.2లక్షలు ఇస్తే సబ్‌డివిజన్ చేస్తానని హామీ ఇచ్చారట. దీంతో తన భూమి సబ్ డివిజన్‌కు అంత ఇచ్చుకోలేనని వెనక్కువచ్చేశాడట. మరోసారి అడిగినా ఆయన అదే విషయం చెబుతూ అది కాకపోతే ప్రత్యర్థి వర్గానికి ఎకరా భూమి రాసివ్వాలని బేరం పెట్టారట.

### బోగస్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో...



షేక్ మస్తాన్‌బీ ఆధార్‌లో పేరు

షబ్బీర్‌కే చెందిన కల్లూరులోని రూ.50లక్షల విలువైన 6 సెంట్ల స్థలాన్ని కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జూన్ 4న పామిడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ చేశారు. అయితే ఇది అక్రమమని బాధితుడు సబ్‌రిజిస్ట్రార్‌ను కలిశాడు. తాను వంశవృక్షం చూసి ఇచ్చానని పామిడి సబ్‌రిజిస్ట్రార్ చెప్పుకొచ్చారట. ఇదే విషయంలో గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం అధికారులు జూన్ 13న ఎఫ్ఎంసీ జారీ చేయడం గమనార్హం. సంబంధిత వ్యక్తులకు ఇచ్చిన ఫ్యామిలీ సర్టిఫికెట్ నకిలీదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. స్థలం బాధితుడి పెదనాన్న ఇమాంసాబ్‌ది. ఆయన మృతి చెందాడు. ఆయన మొదటి భార్య హఫీజాబీ కొడుకు షెక్షావలి. అంతే. కానీ అవతలివారు రెండో భార్యగా షేక్ మస్తాన్‌బీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో సృష్టించారు. రెండో భార్య ఉన్నది వాస్తవమే అయితే ఆధార్‌లో, ఎఫ్ఎంసీలో, వంశవృక్షంలో తేడాలుండటం నకిలీదని స్పష్టం చేస్తోంది. దీనికితోడు ఇమాంసాబ్ పేరు కూడా తప్పుగా ఉంది. ఆధార్‌లో షేక్ మస్తాన్ బీ భర్త ఎస్.ఇమాములు అని ఉంది. గార్లదిన్నె మండల అధికారులు ఇచ్చిన ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో షేక్ మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్ అని ఉంచారు. ఇక వంశవృక్షంలో వై.మస్తాన్ బీ భర్త వై.ఇమాంసాబ్‌గా ఉంది. ఇంత గందరగోళం ఉంటే గార్లదిన్నె తహసీల్దార్ పేరుతో ఆ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారనేది సందేహాలకు తావిస్తోంది. అదేవిధంగా ఆన్‌లైన్ మ్యుటేషన్‌లోనూ వై.మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్‌గా ఉంది.

### డబ్బులు అడుగుతున్నారు: షబ్బీర్ అలీ, శిరివరం, గార్లదిన్నె మండలం



సర్వేనెంబరు 217లో 3.5ఎకరాలు ఆక్రమించారు. 14ఎకరాలు సబ్‌డివిజన్ చేయమంటే రెవెన్యూ అధికారులు డబ్బులు అడుగుతున్నారు. కల్లూరులోని ఆరు సెంట్లలోనూ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. ఆధారాలు లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సైతం రిజిస్ట్రేషన్ అయ్యాక ఎలా ఇచ్చారు. అందులోనూ అన్నీ తప్పులే ఉన్నాయి. అధికారులు ఇది గమనించలేరా..?

# సమస్యల గురుకులం...!

- వేధిస్తున్న తరగతి గదుల కొరత
- ఆరు బయటే స్నానాలు, భోజనాలు
- కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



ఆరుబయటే స్నానాలు చేస్తున్న విద్యార్థులు

గార్లదిన్నె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల అసౌకర్యాలకు నిలయంగా మారింది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం మూడో రోడ్డులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను భవనాల కొరతతో గార్లదిన్నెకు మార్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం నిర్మించిన భవనంలోకి 2016లో దీన్ని తరలించారు. మైనార్టీ గురుకుల పాఠశాల భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రాప్తాడు సమీపంలో 6.72 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అలాగే భవన నిర్మాణం కోసం రూ. 17 కోట్లు మంజూరు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ మైనార్టీ గురుకుల పాఠశాలకు సొంత భవనం సమకూరకుండా ఉంది. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ భవనం విద్యార్థులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో సుమారు 400 పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 12 గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా చిన్న విస్తీర్ణంతో ఉండటంతో పగలు తరగతి గదులుగా... రాత్రి పడక గదులుగా వినియోగించుకుంటున్నారు. విద్యార్థుల సామగ్రి కూడా అదే గదులలోనే నిల్వ ఉంచడంతో గదులు పూర్తి ఇరుకుగా మారాయి. మరుగుదొడ్లు, స్నానపు గదుల కొరత తీవ్రంగా ఉంది. భోజనశాల, వంట గదులు అసలే లేవు. దీంతో విద్యార్థులు తమ అన్ని పనులను ఆరుబయటే కానిస్తున్నారు. ఇరుకు గదుల్లో ఎక్కువ మంది ఉండటం వల్ల సీజనల్ వ్యాధుల తొందరగా ప్రబలుతున్నాయి. పర్యవేక్షణకు వచ్చిన అధికారులతో సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్ని సార్లు ఆవేదన వ్యక్తం చేసినా ఫలితం శూన్యం.

### పట్టించుకోని పాలకులు, అధికారులు

మైనార్టీ గురుకుల పాఠశాలను పలుమార్లు అధికారులు, పాలకులు సందర్శించడమే తప్ప దాని అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పాఠశాలను సందర్శించిన ప్రతిసారీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రగల్భాలు పలకడం తప్ప చేసిందేమీ లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ పిల్లలకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



తలుపులు లేని మరుగుదొడ్లు



ఆరుబయటే భోజనం చేస్తున్న విద్యార్థులు

### అన్నీ గదులలోనే...



పాఠశాలలో సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చదువుకునే గదులలోనే నిద్రపోతున్నాం. ఆదే గదిలోనే సామగ్రి పెట్టుకుంటున్నాం. ఒకే గదిలో చదువు, నిద్ర, సామగ్రి అంటే ఇబ్బందిగా ఉంది. దీంతో పగలు తరగతి గది...రాత్రి పడక గదిలా గడుపుతున్నాం. ఒక్కో గదిలో 70 నుంచి 80 మంది ఉంటున్నాం.

-ఎల్లప్ప, విద్యార్థి పదో తరగతి, పత్తికొండ

### గదుల కొరత తీవ్రంగా ఉంది



పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. ఈ పాఠశాలలో అన్ని సమస్యలే. చదువుకోవాలన్న, నిద్రపోవాలన్న తీవ్ర ఇబ్బందులు పడు తున్నాం. భోజనం చేసేందుకు గదిలేకపోవడంతో ఆరుబయటే తింటున్నాం. వర్షం వస్తే తడుస్తు భోజనం చేయాలి. గురుకుల పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్కరికి సమస్యను చెబుతున్నా ఫలితం లేదు. గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించి విద్యార్థుల చదువుకు సహకరించాలి.

- షెక్షా, విద్యార్థి డోన్

### మా సమస్య పరిష్కరించే నాథుడే లేడు



మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే నాథుడే లేడు. ఐదో తరగతి నుంచి మైనార్టీ గురుకుల పాఠశాలలోనే చదువుకుంటున్నాం. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. అధికారులు, నాయకులు వస్తారు. పాఠశాలను సందర్శిస్తారు. అయితే సమస్యలను మాత్రం పరిష్కరించిన పాపన పోలేదు. అధికా రులు, నాయకులు స్పందించి మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. - హరివాజ్ విద్యార్థి

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మైనార్టీ గురుకుల పాఠశాలలో తరగతి గదుల కొరత ఉన్న విషయం వాస్తమే. విద్యార్థులకు భవనం సరిపోవడంలేదు. భవనంలో 12 గదులు మాత్రమే ఉన్నాయి. గదుల కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవలే 6 బాతురూంలు నిర్మించాం. ఒక స్టేజ్ నిర్మించాం. మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తామంటున్నారు.

-ఆంజనేయులునాయక్, ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల పాఠశాల





# నీకు నేను.. నాకు నీవు రక్ష

### నేడు రాఖీ పౌర్ణమి

అనంతపురం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దూరం పెరిగినా, కాలం మారినా, ఎన్నటికీ చెరగనిది, తరగనిది అన్నాచెల్లెళ్ల అనుబంధం. ఒకరికి ఒకరు అండగా ఉన్నామనే ధీమానిచ్చే బంధం. సోదర బంధానికి గుర్తుగా జరుపుకునే పండుగ రాఖీ. కులమతాలకు అతీతంగా సోదర సోదరీమణులు రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. శనివారం రాఖీ పౌర్ణమి నేపథ్యంలో తమ సోదరులకు రాఖీలను కట్టేందుకు సోదరీమణులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రాఖీ కొనుగోలుదారులతో దుకాణాలు సందడిగా మారాయి.



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు

### కులమతాలకు అతీతమైన వేడుక



సమాజంలో కులమతాలకు అతీతంగా జరుపుకునే వేడుక రాఖీ పండుగ. అందుకే అన్నివర్గాల వారికి భరోసా కల్పిస్తూ ప్రజాపిత బ్రహ్మకుమారీలంతా కలిసి రాఖీలు కట్టి ఆత్మీయతను పంచుకుంటున్నాం. ప్రపంచమంతా ఒకే కుటుంబం లాంటిదని మన పురాణాలు చెబుతున్నాయి. అందుకే రాఖీ పండుగను కేవలం భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం.

- శారద, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం

## ఉద్యాన పంటల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

- ఎన్‌హెచ్‌బీ ఎండీని కోరిన ఎంపీ అంబికా



ఎన్‌హెచ్‌బీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం, ఆగస్టు 8(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేక తోడ్పాటును అందించాలని జాతీయ ఉద్యాన బోర్డు (ఎన్‌హెచ్‌బీ) ఎండీ ప్రియరంజన్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌బీ ఎండీని శుక్రవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ అంబికా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై ఎండీకి ఆయన వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యాన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.505 కోట్లలో దాదాపు రూ.300 కోట్లు విడుదల చేయలేదన్నారు. అయితే రాష్ట్రంలో ఇప్పటికే కుప్పంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ) ను అనుసరించి చిత్తూరు జిల్లా కుప్పంతోపాటు పల్నాడు, అరకు ప్రాంతాల్లో కొత్తగా సీఈఓలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అనంత జిల్లాలో అరటి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, జామ, సపోట, టమోటా తదితర ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఎండీని ఎంపీ కోరారు. రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజీలు, పోస్ట్ హార్వెస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లతోపాటు పెండింగ్ ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతి ఇవ్వాలన్నారు. రైతులకు మార్కెట్ లింకేజీలు, విలువ జోడింపు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభ్యున్నతి, ఉద్యాన రంగ అభివృద్ధిపై మరింత చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు.

## 'సూపర్ స్పెషాలిటీ'లోనూ అత్యవసర సేవలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా అత్యవసర సేవల(ఎమర్జెన్సీ) విభాగాన్ని ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 11నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. అందుకు తగిన వైద్య సిబ్బంది, సహాయక సిబ్బంది, అవసరమైన సదుపాయాలు సమకూర్చి 24గంటలూ నిరంతరాయంగా సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

## షట్లర్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. నేషనల్ స్పోర్ట్స్‌ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అండర్-19బాలుర విభాగంలో శ్యామ్‌నాథ్, రిహాన్, నివాస్, ఇషాన్, తలాహా ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మౌనిక, రిధి, ఇంద్రాణి, గుణసాయి. ఇందు, సాస్మిక, హారిక ఎంపికయ్యారు. వీరు తిరుపతిలో ఈనెల 12న జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శాప్ కోచ్ నరేష్‌కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన షట్లర్లు



## చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 771 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## టమోటా కిలో రూ.37

అనంతపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.20, సరాసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.



క్రైం కార్నర్

## గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య


యువకుడి మృతదేహం

గోరంట్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. మృతుడి వయసు 25నుంచి 30ఏళ్ల లోపు ఉంటుందన్నారు. ప్రధాన రహదారికి సమీపంలోని చెట్టుకు టవల్‌తో ఉరివేసుకోగా, స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై ప్యాంటు, షర్టు ఉన్నాయి. చెప్పులు చెట్టువద్ద వదలగా, లాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు పేర్కొన్నారు. కుడి చెయ్యి అరచేతి పైభాగంలో నాగుపాము గుర్తు, చేయి పైభాగంలో అమ్మ ఏఎస్ అని పచ్చబొట్టు వేయించుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్సపొందుతూ మృతి

● అవ్వ మృతిని జీర్ణించుకోలేక మనవడు ఆత్మహత్య


హనుమేష్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అవ్వ మరణం తట్టుకోలేక మనవడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దేవగిరి క్రాస్‌లో జరిగింది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. కురుబ హనుమేష్ (22) ఈనెల 6న పురుగులు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 5న మృతుడి అవ్వ మల్లమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందింది. చిన్నప్పటి నుంచి అల్లరుముద్దుగా పెంచిన అవ్వ దూరమవడంతో హనుమేష్ తట్టుకోలేక అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మూడురోజుల్లో తల్లిని, కొడుకును పోగొట్టుకున్న ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి తండ్రి వన్నూరుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## జీవితంపై విరక్తితో యువకుడి బలవన్మరణం

తాడిపత్రి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరిచింతల గ్రామానికి చెందిన వెంకటరమణ (29) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వెంకటరమణ 2021లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇతను జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది మద్యంలో రంగుపొడర్‌ను కలుపుకొని తాగాడు. అపస్మారకస్థితిలో పడిఉన్న వెంకటరమణను స్థానికులు గుర్తించి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబికులు తెలిపారు. మృతుడికి భార్య దేవితోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పెన్సిల్ గొడవ కేసులో నిందితుల అరెస్టు


అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న సీఐ

కళ్యాణదుర్గం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెన్సిల్ గొడవలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు విద్యార్థులు బడిలో పెన్సిల్ కోసం గొడవ పడటం, అది వారి తల్లిదండ్రులకు చేరడం, ఆపై జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం పాఠకులకు విదితమే. ఈ సంఘటనకు సంబంధించి కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వరరావు ఐదుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాల మేరకు శెట్టూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మూడో తరగతి చదువుతున్నారు. వీరిద్దరు పెన్సిల్ కోసం గొడవ పడ్డారు. బడి వదిలాక సాయంత్రం ఇంటికెళ్లి ఇరువురు వారి తల్లిదండ్రులకు చెప్పారు. తమ కొడుకును కొట్టారని ఓ బాలుడి తల్లిదండ్రులు మర్రిస్వామి, మరియమ్మ ఆగ్రహించారు. మరో బాలుడి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులు ప్రకాష్, ప్రమీళమ్మపై దాడి చేశారు. ఈక్రమంలో తీవ్రంగా గాయపడిన ప్రకాష్ మృతి చెందాడు. ఈ సంఘటనను పూర్తిస్థాయిలో విచారించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. శెట్టూరు గ్రామానికి చెందిన చింతర్లపల్లి మారెక్క, కరిడిపల్లి వన్నూరక్క, శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లికి చెందిన లక్ష్మణ్ణ, రాజు, ఇదే మండలం కరిడిపల్లి గ్రామానికి చెందిన హరిజన తిప్పేస్వామిలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## హత్య కేసులో నిందితుడు..

గుంతకల్లుటౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన దాసరి గోవిందు హత్య కేసులో నిందితుడైన దాసరి ఓబయ్యను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్పతో కలిసి రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. దాసరి గోవిందు ఇంటి పక్కనే అతడి సమీప బంధువు దాసరి ఓబయ్య నివాసముంటున్నాడు. దాసరి ఓబయ్య, అతడి కొడుకు దాసరి రుశిదాసుతో ప్రతి రోజు దాసరి గోవిందు గొడవ పెట్టుకుని, అసభ్యకరంగా మాట్లాడేవాడు. దీంతో దాసరి గోవిందును అడ్డుతొలగించుకోవాలని తండ్రీకొడుకులు పథకం రచించారన్నారు. బుధవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న దాసరి గోవిందును దాసరి ఓబయ్య, దాసరి రుశిదాసులు వేటకొడవలితో నరికి హత్య చేశారన్నారు. శుక్రవారం హనుమాన్ సర్కిల్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న దాసరిఓబయ్యను అరెస్ట్ చేశామన్నారు. దాసరి రుశిదాసు పరారీలో ఉన్నాడు అతడి కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# రూ.కోట్లు వృథా..!

## నిరుపయోగంగా డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలు

● మొబైల్ యాప్‌ల రాకతో కొరవడిన ఆదరణ
● ప్రభుత్వానికి భారంగా యంత్రాల నిర్వహణ

కొత్తచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి, తెచ్చిన డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలు నిర్వహణ ప్రస్తుత ప్రభుత్వానికి భారంగా మారింది. దీంతో ఆ యంత్రాలు మూలకు చేరాయి. వైసీపీ పాలనలో 2020-21లో డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలను రైతుల కోసం కొనుగోలు చేసి, రైతు భరోసా కేంద్రాల్లో (రైతు సేవా కేంద్రాలు)ఉంచింది. ఈ యంత్రాల ద్వారా రైతులు తాము కోరుకున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇతర వ్యవసాయ పనిముట్లు కోరుకున్న కంపెనీల నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా 416 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 389 డిజిటల్ కియోస్క్ యంత్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో యంత్రానికి రూ.70 వేలు వెచ్చించింది. పంట సాగు, తెగుళ్ల నివారణ, తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులు తదితర అంశాలపై టీవీ కార్యక్రమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఒక్కో టీవీని రూ.45 వేలు చెప్పున కొని రైతు భరోసా కేంద్రాల్లో ఉంచారు. వ్యవసాయ సిబ్బంది వీటికి తమ మొబైల్ ద్వారా నెట్ కనెక్టు చేసుకొని కొన్ని నెలల పాటు వినియోగించినా ప్రస్తుతం మూలకు చేరాయి. సరైన నిర్వహణ లేక కొన్నింటికి బ్యాటరీలు పనిచేయక పోవడం, మరికొన్ని మరమ్మతులకు గురికావడం, డిష్, ఇంటర్ నెట్ సౌకర్యం లేకపోవడం తదితర సమస్యలతో ఈ యంత్రాలు మూలకు చేరాయి. కొన్నిచోట్ల టీవీలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం ఆయా కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికే పెద్ద ఎత్తున నిధులను వృథా చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు.

### మొబైల్ యాప్‌ల రాకతో నిరుపయోగంగా కియోస్క్‌లు

ప్రతి మారుమూల గ్రామాల్లోని రైతులకు సైతం ఉపయోగపడే విధంగా గూగుల్ కంపెనీ పలు విత్తనాలు, పురుగు మందుల కంపె నీలు, పంటలకు సంబంధించి మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీంతో ఈ డిజిటల్ కియోస్క్ యంత్రాల జోలికి ఎవరూ పోవడం లేదు. దీంతో అవి రైతుసేవా కేంద్రాల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ డిజిటల్ కియోస్క్ యంత్రాల ఎదుట రైతులు నిలబడి స్క్రీన్‌ను వేలితోతాకి, ఆధార్, ఫోన్ నెంబర్ ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. లాగిన్ అవగానే వివిధ కంపెనీలకు సంబంధించి రకరకాల పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాటి బొమ్మలు, వాటి ధరలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. దీంతో రైతు కంపెనీని ఎంపిక చేసుకొని, ఆర్డర్ చేస్తే ఆయా కంపెనీలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రెండు, మూడు రోజుల్లో సరఫ చేస్తాయి. ఇంత ఉపయోగం ఉన్న యంత్రాల నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారడంతో వీటిని గత ప్రభుత్వమే పక్కన పెట్టిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.


కొత్తచెరువు రైతుసేవా కేంద్రంలో పనిచేయని డిజిటల్ కియోస్క్ యంత్రం

### ఆదరణ తగ్గింది

ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించి వివిధ రకాల మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు వాటిని వినియోగిస్తూ, కియోస్క్ యంత్రాలను పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టు పూర్తి కావడంతో ఈ యంత్రాల నిర్వహణ ఆగింది. కొన్ని చోట్ల యంత్రాలు పని చేస్తున్నాయి. మరికొన్ని చోట్ల బ్యాటరీల సమస్యతో యంత్రాలు పనిచేయలేదు. ప్రభుత్వానికి మొబైల్ యాప్ నిర్వహణ కంటే ఈ కియోస్క్ యంత్రాల నిర్వహణకు అయ్యే వ్యయమే ఎక్కువ

-సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

## 295 బస్తాల బియ్యం సీజ్



సీజ్‌చేసిన వాహనం వద్ద అధికారులు

తాడిపత్రి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె క్రాస్‌వద్ద శుక్రవారం కర్ణాటకకు తరలిస్తున్న 295ప్యాకెట్ల రేషన్ బస్తాలతో పాటు ఐషర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారి ప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్ నాగేంద్ర, క్లీనర్ సురేష్, యజమాని నాగార్జున, వాహన యజమాని రామచంద్రలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో ముగిసిన శిక్షణ

అనంతపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. కళాశాల ది ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెల్ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజ్లీ యోజనపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. గత నెల 28వతేదీన ఈ శిక్షణ ప్రారంభమైందన్నారు. ఇందులో 150మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తర్వాత అందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎన్ఐఈఎస్‌బీయూడీ సీనియర్ కన్సల్టెంట్ యామిని జైస్వాల్, ఒడిశా చీఫ్ కన్సల్టెంట్ ప్రభాకర్ బహుగుణ, రాష్ట్ర కోర్డినేటర్ ప్రకాశ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దంచికొడుతున్న వాన

(5వ పేజీ తరువాయి)

పడింది. పుట్లూరు 4.8, అనంతపురం 4.2, విడపనకల్లు 4.0, రాప్తాడు 3.4, ఉరవకొండ 2.0, గుత్తి 1.8, బొమ్మనహాళ్‌లో 1.2 మీ.మీ వర్షపాతం నమోదైంది.

### నల్లమాడలో అత్యధిక వర్షపాతం

జిల్లాలోని 18 మండలాల్లో వర్షం కురవగా, మిగిలిన మండలాల్లో వర్షం పడలేదు. ఇందులో గురు వారం రాత్రి 9 మండలాల్లో అత్యధిక వర్షం కురిసింది. నల్లమాడ మండలంలో అత్యధికంగా 50 మిల్లిమీటర్ల వర్షం పడింది. లేపాక్షి మండ లంలో 47.2 మిల్లీమీటర్లు, ఓబుళదేవరచెరువలో 45.4, తాడిమర్రి 39.2, నల్లచెరువులో 34.2, కదిరిలో 31.2, గోరంట్లలో 22.4,బుక్కపట్నం 22, ముదిగుబ్బలో 20.4,గాండ్లపెంటలో 20, తనకల్లు 18.8,ధర్మవరం 18.2, తలుపుల 15.4, నంబలపూలకుంట14.2, నల్లచెరువు చిలమత్తూరు 9.4,అమడగూరు 5.4,పుట్టపర్తి 3.2,కొత్తచెరువులో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలంలోని లింగారెడ్డిపల్లి, కణిశెట్టిపల్లి, నారేపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది.


వాన నీటితో నిండిపోయిన ఆర్టీసీ బస్టాండు పరిసరాలు


రాజు రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

### ఐదు రోజులకు వర్షసూచన

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి లేదా ఓ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్ష సూచన ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 32-33 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22-22.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. వాయవ్యం దిశగా గాలులు గంటకు 8-12కి.మీవేగంతో వీచే అవకాశము ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం 78-83, మధ్యాహ్నం 52-73 నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అనంతపురం 9న 22.4 మి.మీ, 10న 12 మి.మీ 11న 7.1 మి.మీ , 1.2న 2.8 మి.మీ 13న 5.1 మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 9న 30.3 మి.మీ, 10న 9.1 మి.మీ 11న 7.5 మి.మీ, 1.2న 2.6 మి.మీ 13న 4 మిమీ కురిసే అవకాశం ఉందన్నారు.


వర్షంలో చిరువ్యాపారుల అగచాట్లు


వానలో ఇబ్బంది పడుతూ స్కూటీపై వెళ్తున్న ప్రయాణికులు

# 'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్

● డాక్టర్‌తో రూ.60లక్షలు అప్పు తీసుకున్న యజమాని
● చెల్లించలేక దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించిన వైనం
● తాజాగా మరొకరికి కూడా.. నిలదీసిన బాధితులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఒకరి పేరుతో ఉన్న ఆస్తిని మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం పరిపాటిగా మారింది. అనంతపురం నగరంలోని సాయినగర్ 6వ క్రాస్‌లోని రెండు దుకాణాలకు సంబంధించిన యజమాని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో బాధితులు అలా ఎలా చేయిస్తారని నిలదీస్తున్నారు. నగరానికి చెందిన ప్రదీప్ తనకు సాయినగర్‌లోని 6వ క్రాస్‌లో ఉన్న రెండు దుకాణాలను డాక్టర్ షరీఫ్‌కు అద్దెకు ఇచ్చారు. ఆ డాక్టర్ అక్కడ ఐ కేర్ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. 2019లో ప్రదీప్ డాక్టర్‌తో రూ.60లక్షల వరకు డబ్బు తీసుకున్నాడు. అయితే ఆ డబ్బు తిరిగి ఇవ్వలేకపోయాడు. దీంతో 2024 ఏప్రిల్‌లో ఆ రెండు దుకాణాలను డాక్టర్ షరీఫ్‌కు రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే ఐదు నెలల కిందట ప్రదీప్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. తాను డాక్టర్ షరీఫ్‌తో డబ్బు తీసుకున్న విషయం వాస్తవమేనని, ఆ దుకాణాల ఆస్తి విలువ రూ.1.2కోట్ల వరకు ఉందని తెలిపాడు. తెలియక రిజిస్ట్రేషన్ చేయించానని రద్దు చేయించాలని కోరారు. దీంతో పోలీసులు డాక్టర్ షరీఫ్‌ను పిలిపించారు. తనకు డబ్బు ఇవ్వనందుకే రిజిస్ట్రేషన్ చేయించారని, అవసరమైతే ఎంత డబ్బు ఇంకా ఇవ్వాల్సి ఉందో అంత ఇస్తానని ఆయన చెప్పాడు. ఇందుకు సీఐ శ్రీకాంత్... ఈ విషయంలో తామేమీ చేయలేమని, రిజిస్ట్రేషన్ అధికారులను లేదా కోర్టును ఆశ్రయించాలని సూచించారు. కానీ మే నెలలో ప్రదీప్ శివశంకర్ అనే వ్యక్తికి అదే దుకాణాలను రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో బాధిత వర్గం తమకు రిజిస్ట్రేషన్ చేయించిన ఆస్తిని మరొకరికి ఎలా రిజిస్ట్రేషన్ చేయిస్తారని నిలదీశారు. తాము మార్ట్‌గేజ్ పేరుతో రుణం తీసుకున్నా రిజిస్ట్రేషన్ చేశారని, దీని వెనుక అధికారపార్టీ నేతల అండ ఉందంటున్నారని బాధితులు వాపోతున్నారు.

### డబుల్ చెల్లుతుందా..?

మ్యుటేషన్‌లో ప్రదీప్ పేరు ఉండటంతో అదే ఆస్తిని అధికారులు డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈసీ చూసి ఉంటే వ్యవహారం బయటపడేది. కాగా డబుల్ రిజిస్ట్రేషన్ ఎప్పటికీ చెల్లదని అధికారులు అంటున్నారు. ఈ విషయంపై బాధితులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఇరువర్గాలకు నోటీసులు జారీ చేశారు. తాజాగా అక్రమ రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ అధికారుల నివేదిక మేరకు కలెక్టర్ రద్దు చేసే అవకాశముంది. ఇక్కడ ప్రదీప్ శివశంకర్‌తో పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించి ఉంటాడని భావిస్తున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చెల్లదని తెలిసినా శివశంకర్ ఎలా చేయించుకున్నాడో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## తేనెటీగల దాడిలో వృద్ధుడి మృతి


ఆంజనేయులు(ఫైల్)

రాయదుర్గంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఆంజనేయులు(62) మృతి చెందిన సంఘటన శుక్రవారం గౌడ లేఅవుట్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో నివాసం ఉంటున్న ఆంజనేయులు తనకున్న మేకలను మేపేందుకు పట్టణంలోని గౌడ లేఅవుట్‌కు వెళ్లాడు. మేకల మేత కోసం రాగి ఆకులు కోస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. స్థానికులు గుర్తించి అతడిని రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య వసంతమ్మ, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

బుక్కపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారాల రిజర్వాయర్‌లో గుర్తు తెలియని పురుషుడి శవం లభ్యమైనట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. రిజర్వాయర్ సమీపంలో దుర్వాసన రావడంతో పలువురు రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం ఎస్ఐ వెళ్లి పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. మృతుడి వివరాలు వైద్యుల నివేదిక ద్వారా తెలుస్తాయన్నారు.

## జీడిపల్లి రిజర్వాయరుకు 2,110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,110 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 2070 క్యూసెక్కులు వుండగా రిజర్వాయరులో నీటి నిల్వ 1.806 టీఎంసీలు వుందని వెల్లడించారు.

# బిగుస్తున్న ఉచ్చు..!

### దాల్‌మిల్ సూరి సోదరుల కోసం పోలీసుల వేట

పుట్టపర్తి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): వ్యాపారాలపేరుతో సన్న, చిన్నకారు రైతుల మొదలుకుని బడా వ్యాపారులు, రాజకీయ నేతలదాకా అందరినీ కోట్లలో మోసం చేసిన ఆర్థిక నేరగాళ్లు, వైసీపీ నాయకులు కొత్తచెరువుకు చెందిన దాల్‌మిల్ సూరి సోదరులపై పోలీసులు ఉచ్చు బిగిస్తున్నారు. తాజాగా దాల్‌మిల్ సూరిపై జిల్లా పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. వారి మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కొత్తచెరువుకు చెందిన వైసీపీ నాయకుడు దాల్‌మిల్ సూరి (మొరంశెట్టి సురేష్) వ్యాపారాల పేరుతో పదేళ్లుగా జిల్లాతోపాటు పలు రాష్ట్రాల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి, పలు రంగాల్లో వ్యాపారాలకు వైట్ కాలర్ మోసాలకు పాల్పడినట్లు కేసలు నమోదయ్యాయి. రూ.200 కోట్లదాకా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిలదీస్తే బాధితులపైనే దాడులు చేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఇటీవల కొత్తచెరువులో ఓ భూ వివాదంలో బాధితులపై తీవ్రంగా దాడి చేయడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో దాల్‌మిల్ సూరితోపాటు అతడి సోదరుడు పాండు, అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో వారు చేసిన ఘనారా మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థల వివాదం కేసులో దాల్‌మిల్ సూరి సోదరుడు పాండును జూన్‌లో అరెస్టు చేయగా.. బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్రస్తుతం పాండు పరారీలో ఉన్నాడు. అప్పటి నుంచి దాల్‌మిల్ సూరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇటీవల వీరి ఆర్థిక మోసాలతోపాటు అక్రమాలు, దౌర్జన్యాలపై బాధితుల ఫిర్యాదులు చేయడంతో పోలీసులు చర్యలు మొదలుపెట్టారు. ఈనేపథ్యంలోనే దాల్‌మిల్ సూరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, లుకౌట్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే దాల్‌మిల్ సోదరులపై అన్నివైపుల నుంచి ఉచ్చు బిగుస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### బాధితుల ఫిర్యాదులు

దాల్‌మిల్ సూరి సోదరుల మోసాలపై జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి బాధితులు వచ్చి కొత్తచెరువు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దాల్‌మిల్ సూరి తన వ్యాపారాల వ్యూహాలతో 15 ఏళ్లగా అప్పుమీద ఆహార ధాన్యాలు మొదలుకొని పలు హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ భారీ మోసాలకు పాల్పడినట్లు నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. గత ఆరు నెలల్లో 7 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇలా ఇప్పటికే అతడిపై 36 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. గత మూడేళ్లుగా దాల్‌మిల్ సూరితోపాటు అతడి సోదరుడు పాండుపై ఆర్థిక నేరాల్లో నమోదైన కేసుల్లో బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా కోరిందంటే ఆర్థిక నేరాలు ఏమేరకు చేశారో తెలుస్తోంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడిన దాల్‌మిల్ సూరి దేశం విడిచి వెళ్లిపోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేస్తున్నట్లు జిల్లా పోలీసు యంత్రాంగం తెలిపింది. దాల్‌మిల్ సోరుదుల బాధితులు ముందుకు రావాలని పోలీసు శాఖ చెబుతోంది. పాండుపై జిల్లాతో పాటు ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో 47 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. అతడి బాధితుల్లో బడా వ్యాపారులతోపాటు రాజకీయ నేతలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారంలో వాటా ఇస్తామని జిల్లాకి చెందిన ఓ మాజీ మంత్రికి ఏకంగా రూ.50 లక్షలకు కుచ్చుటోపీ పెట్టినట్లు తెలుస్తోంది. ఆలా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలో చాలామంది వీరి చేతిలో మోసపోయినట్లు తెలుస్తోంది. బయటకు చెప్పుకోలేకపోతున్నారు. దాల్‌మిల్ సూరి సోదరులకు పలుసార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా.. ఏమాత్రం మార్పురాలేదు. వీరి ఆట కట్టించేందుకు పోలీసులు చర్యలు మొదలు పెట్టారు. వారి కోసం వేట సాగిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే దాల్‌మిల్ సోదరులకు పోలీసు ఉచ్చు బిగుస్తోందన్నది స్పష్టమవుతోంది.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని 34 మందికి రూ. 20 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాలకు చెందిన 19 మందికి రూ. 12.10 లక్షలు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 15 మందికి రూ. 7.90 లక్షల విలువైన చెక్కులు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులకు అడిగిన వెంటనే సీఎం చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందించిన అండగా నిలుస్తున్నారని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారు లు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపారు.

# సింగిల్ విండో అధ్యక్షుడికి సన్మానం



రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాచానపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు పామురాయి రఘును గ్రామంలోని టీడీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన్ను స్థానిక నివాసంలో కలిసి పూల మాలు, శాలువాలతో సన్మానం చేశారు. తర్వాత బుక్కరాయసముద్రానికి వెళ్లి అక్కడి సింగిల్ విండో అధ్యక్షుడు కేశన్నను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం రవి, యాలేటి గోపాల్, డీలర్ ఆదినారాయణ, హుసేన్, కాంట్రాక్టర్ వెంకటేశ్, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మకు ప్రభావళి అందజేత



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

అనంతపురం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయినగర్ 4వ క్రాస్‌లోని కనకదుర్గమ్మ ఆలయానికి స్థానికుడైన ఓ భక్తుడు ప్రభావళి వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులను శుక్రవారం కలిసి రూ.50వేలు విలువ చేసే పంచలోహ ప్రభావళిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రభావళితోపాటు నగదుతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు సామూహిక లక్ష్మీ అష్టోత్తరం, లలితా సహస్రనామ పారాయణాలు చేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# వర్షం రాకతో.. అన్నదాతల హర్షం



చీనీతోటలో నిలిచిన నీరు

గార్లదిన్నె, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. ముందస్తు వర్షాలకు వేరుశనగ పంటను సాగుచేశారు. తరువాత వర్షం రాకపోవడంతో ఆ పంట ఎండుముఖం పట్టింది. బోరు బావుల్లోనూ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పండ్లతోటలు కూడా ఎండుముఖం పట్టాయి. మర్తాడు, కోటంక, ముకుందాపురం, జంబులదిన్నె కొట్టాల తదితర గ్రామాల్లో పండ్లతోటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో ఆయా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

## ఇళ్లల్లో మహిళల ప్రత్యేక పూజలు

న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీవ్రత పూజలను అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయాల్లో అర్చకులు మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున వెళ్లి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు పొందారు. మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మీ అమ్మవారిని కొలువుదీర్చి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పలువురు మహిళను ఇళ్లకు ఆహ్వానించి వాయనాలు ఇచ్చారు.



కనగానపల్లి, శింగనమలలో ప్రత్యేకాలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు

# వైభవోపేతం.. సత్యదేవుని వ్రతం



సత్యదేవుని వ్రతాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



రమా సమేత సత్యనారాయణస్వామికి సమర్పించిన స్వర్ణ, వెండి పుష్పాలు

అనంతపురం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శివకోటి ఆలయంలో సత్యదేవుని వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతమండపాన్ని విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి వ్రతాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అలాగే రమాసమేత సత్యనారాయణస్వామికి స్వర్ణ, వెండి పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీలో తీరిన తాగునీటి సమస్య

ఆంధ్రజ్యోతి స్పందన

శింగనమల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆ కాలనీలో బోరు వేయించి..నీటి సమస్య తీర్చారు. ఎస్సీ కాలనీలో ప్రజలు గత ఆరు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతుండేవారు. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మండల స్థాయి అధికారులతో చర్చించి తాగునీటి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు. దీంతో అధికారులు కాలనీలో నీటి సమస్యను తీర్చడానికి ప్రత్యేక నిధుల కింద రెండున్నర లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఇక వాటితో గత గురువారం రాత్రి ఎస్సీ కాలనీలో బోరు వేయించారు. దాదాపు మూడు ఇంచుల నీరు పడడంతో కాలనీలో ఇక తాగు నీటి సమస్య తీరినట్టేనని ఎస్సీ కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కాలనీలో నీటి సమస్యను పరిష్కరించడానికి చొరవచూపిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# శింగనమల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు..

అనంతపురం న్యూటౌన్/శింగనమల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం శింగనమల తాలూకా యూనిట్ కమిటీ ఎన్నికను శింగనమలలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఏకగ్రీవంగా చేపట్టారు. అందులో ఆ యూనిట్ అధ్యక్షుడిగా గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయం ఏఓ బాబాఫక్రుద్దీన్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నార్పల ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎం సుబహాన్‌ను, ప్రధాన కార్యదర్శిగా శింగనమల ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ప్రతాప్‌ను, సంయుక్త కార్యదర్శిగా నలకం చెరువు జెడ్పీ పాఠశాల రికార్డు అసిస్టెంట్ క్రిష్టయ్యను, ట్రెజరర్‌గా శింగనమల ఎంపీడీఓ కార్యాలయం టైపిస్ట్ నిర్మలను, ఈసీ మెంబర్లుగా వెంకటాపురం పాఠశాల ల్యాబ్ అసిస్టెంట్ డీ.క్రిష్ణయ్యను, గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరేంద్రను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సం ఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, ఎంఈఓ నరసింహరాజు, జిల్లా పరిషత్ యూనిట్ కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, లెక్కల శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, రామకిషోర్, హరిబాబు, అల్లాబకాష్, రామకృష్ణ తదితరులతో పాటు శింగనమల, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం మండలాల నుంచి తాలూకా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ‘ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తే.. ఊరుకోం’



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం క్రైం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి) : కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని, అలా చేస్తే ఊరుకునేది లేదని తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహులు హెచ్చరించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి సంబంధం లేని విషయాల్లో సైతం కొందరు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. రెండురోజుల కిందట ఓ మహిళ తన స్థల వివాదంలో ఎమ్మెల్యే, ఆయన బంధువుల పేర్లు చెప్పడం సరికాదన్నారు. అధికారులు ఎవరూ న్యాయం చేయకపోతే...ఎమ్మెల్యే వద్దకు వచ్చిన ఉంటే కచ్చితంగా స్పందించేవారన్నారు. ఎవరో సబ్ రిజిస్ట్రార్ చెబితే...ఆమె ఎలా చెబుతారని వారు ప్రశ్నించారు. ఆమె వెనుక కొందరు వ్యక్తులు ఉండి ఇలాంటి మాటలు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయంగా పబ్బం గడుపుకోడానికి ఇలా కుట్రలు చేయడం సరికాదన్నారు. పోలీసులు సైతం ఆమెను విచారణ చేయించాలని, దీని వెనుక ఎవరున్నారో బయట పెట్టాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటివి జరిగితే ఉపేక్షించమని హెచ్చరించారు. నాయకులు ఈడిగ నాగభూషణం, రూపనగుడి రవిరాయల్, జయరాం నాయక్, కంటా దేవి, సుంకన్న, చందు పాల్గొన్నారు.

# ఎంవీ రమణకు ఘన నివాళి



ఎంవీ రమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత ఎంవీ రమణ మొదటి వర్ధంతిని స్థానిక నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఆ నాటి కాలంలో విశాఖ ఉక్కును ఆంధ్రప్రదేశ్‌లోనే నెలకొల్పాలని జరిగిన పోరాటంలో ఏఐఎస్ఎఫ్‌ను ఉద్యమబాటలో నడిపిన నాయకుడు ఎంవీ రమణ అని గుర్తుచేశారు. పేదల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిస్టు పార్టీ జెండా ఉంచి పోరాటాలు చేసిన యోధుడు అని తెలిపారు. ఆయన ఆశయసాధనకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, కార్యదర్శివర్గసభ్యుడు రాజారెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కార్యవర్గసభ్యుడు జాన్సన్‌బాబు, నగర సహాయ కార్యదర్శి కృష్ణుడు ఎంవీ రమణ కుమారుడు న్యాయవాది వేణుగోపాల్, నాయకులు లింగమయ్య, సంతోష్‌కుమార్, రాజేష్‌గౌడ్, పద్మావతి, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్ళాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

ఆత్మకూరు ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సెలూన్ షాపులకు 200యూనిట్ల మేర సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్ ప్రకటించడంపై నాయీబ్రాహ్మణ సంఘం మండల నాయకు లు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలువురు మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి చంద్రబాబుతోనేని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆనంద్, సర్దానప్ప, ప్రసాద్, నాగరాజు, తిప్పేస్వామి, శ్రీరాములు, ధనుంజయ, ఫణి భూషణ్, వెంకటేశులు పాల్గొన్నారు.

# కోదండ రామాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న వేదపండితులు, గ్రామస్థులు

అనంతపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్ కాలనీలో కోదండ రామాలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తొలుత వేదపండితులు ఆలయ నిర్మాణ స్థలంలో హోమం చేశారు. తర్వాత శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్మాణానికి పంచాయతీ ఎంపీటీసీ-2 సభ్యురాలు రమీజాబీ, బాబు దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు.

# సామూహిక ఒడిబియ్యం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బసంపల్లి కైవారం సద్గురు యోగినారాయణ ఆశ్రమ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు శుక్రవారం సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతియేటా వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో ముత్తైదువులకు ఒడిబియ్యం పోయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 108 మంది మహిళలకు ఒడిబియ్యం పోశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ట్రస్టు అధ్యక్షుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎరా విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో స్కూల్ చైర్మన్

అనంతపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్ రెడ్డి, డైరెక్టర్ వినూత్నరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక పీటీసీ గ్రౌండ్‌లో స్టూడెంట్ ఒలంపిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయని, అండర్ 14 బాలుర జట్టుకు పాఠశాల విద్యార్థులు ఎంపికవడం సంతోషంగా ఉందని అన్నారు. అక్టోబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో టౌన్ 1 ఏడీఈ చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్ మార్కెట్ ఏరియా, వైఎస్సార్ కాలనీ, అంబేడ్కర్ నగర్, కేవీఎస్ నగర్, గిరిప్రసాద్ నగర్, సంగమేష్ నగర్, కమలానగర్, రాజురోడ్డు, రహమత్ నగర్, కోర్టురోడ్డు, క్లాక్ టవర్, అశోక్‌నగర్, జీసెస్ నగర్, హౌసింగ్‌బోర్డు, విద్యుత్‌నగర్, లక్ష్మీనరసయ్య కాలనీ, బుడ్డప్ప నగర్, నవోదయ కాలనీ, కొత్త రెవెన్యూ కాలనీ, చిన్మయ నగర్, ప్రసన్నాయపల్లి, విద్యానగర్, జేఎన్‌టీయూ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 11కేవీ ఫీడర్ల నెలవారీ నిర్వహణ నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాప్తాడు: ధర్మవరం 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు ఉన్నందున శనివారం రాప్తాడు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



# కంపు భరించలేకున్నాం..

- మురుగు కాలవలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- రోడ్డుపైకొస్తున్న మురుగునీరు
- దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం



రోడ్డు పక్కన పారుతున్న మురుగునీరు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్‌కి కూతవేటు దూరంలో ఉన్న మురుగుకాలవలో ప్లాస్టిక్‌తో పాటు వ్యర్థ పదార్థాలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక రోడ్డు పక్కన పారుతోంది. వాటి నుంచి వచ్చే దుర్గంధంతో అటువైపు వెళ్లే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కలెక్టరేట్ సమీపంలో పెన్నార్‌భవన్, పట్టుపరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ, మై భారత్ కార్యాలయాలు ఉన్నాయి. అలాగే విద్యుత్నగర్, రామ్‌నగర్, హౌసింగ్‌బోర్డు, అశోక్‌నగర్ నుంచి కలెక్టరేట్ ప్రధాన రహదారిలోకి రావడానికి ఇదే ప్రధాన రహదారి. ఆ దారి గుండా ఆయా కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, వాహనదారులు ఆ మురుగు వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. నగరపాలక సంస్థ అధికారులు ఇటువైపు తిరిగి చూడలేదు. మురుగు వల్ల వచ్చే కంపు భరించలేకున్నామని, ఇప్పటికైనా ఆ మురుగు కాలవలో వ్యర్థాలు, ప్లాస్టిక్ తొలగించి మురుగునీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## సంక్షిప్త వార్తలు

### సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు తమపై ఎంతో ఆదరణ చూపిస్తున్నారని కొనియాడారు. గతంలో కూడా ఆదరణ పథకం కింద పనిముట్లను అందించారన్నారు. నేడు బార్బర్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించడంతో సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 12, 13న జరిగే జిల్లా సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జిల్లా కేంద్రంలో ఈ మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 7న పట్టణంలో జరిగిన నియోజకవర్గ మహాసభలో స్థానిక సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించినట్లు వివరించారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు, నాగరాజు నాయక్, బుడేన్ తదితరులు పాల్గొన్నారు.

### గొలుసు అపహరణ

పుట్లూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి బయటకు వచ్చిన నాగేశ్వరమ్మ అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగేశ్వరమ్మ భర్త అనారోగ్యంతో గత కొన్నేళ్లక్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఉదయం 4:50 గంటలకు ఇంటి బయట శుభ్రం చేసేందుకు వచ్చింది. దీన్ని గమనించిన దొంగలు ఒకరు బైక్ నుంచి మరొకరు చైన్‌లాగి పరారయ్యారు. కేకలు వేయడంతో గ్రామస్థులు రావడంతో అప్పటికే దొంగలు పారిపోయారు. బంగారు గొలుసు 3.2 గ్రాముల ఉన్నట్లు ఆమె ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నేటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

తాడిపత్రి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఈనెల 9 నుంచి 12వరకు స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. 9న సామూహిక సత్యనారాయణస్వామి పూజ, ధ్వజారోహణం, లక్ష్మీపూజ, గోపూజ, 10న పూర్వారాధన, పంచామృతాభిషేకం, తులసీఅర్చన, పాదపూజ, 11న మధ్యారాధన, అష్టోత్తర పారాయణ క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, రథోత్సవం, 12నఉత్తరారాధనలో భాగంగా నిర్మాల్య విసర్జన, అష్టోత్తర క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రథోత్సవం తదితర పూజా కార్యక్రమాలు జరపనున్నట్లు అర్చకులు తెలిపారు.

### పాము కాటుతో మహిళకు అస్వస్థత

గుత్తిరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంగన్నపల్లిలో శుక్రవారం పాము కాటు వేయడంతో లక్ష్మీ అనే వ్యవసాయ కూలీ అస్వస్థతకు గురైంది. ఉదయం ఆమె పొలంలో కలుపు తీసే వేళ పాము కాటు వేయడంతో వెంటనే తోటి కూలీలు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

### నేడు బొలికొండ రంగనాథస్వామి కల్యాణం

గుత్తిరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి కల్యాణాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శోభ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్వామికి వేకువజామున అభిషేకాలు, సహస్ర నామార్చన, కలశ స్థాపన, గణపతి పూజ నిర్వహిస్తామన్నారు. ఉదయం 12-05 గంటలకు శ్రీదేవి, భూదేవి సహిత బొలికొండ రంగనాథస్వామి కల్యాణం, మధ్యాహ్నం మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం గ్రామోత్సవం, పల్లకి ఊరేగింపు, ఊంజల సేవ నిర్వహిస్తామన్నారు. రాత్రికి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### పథకాల అమలుపై కేంద్రబృందం పరిశీలన

పుట్లూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకటవేముల గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపై కేంద్రబృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు సాంబశివరావు, నవ్య క్షేత్ర స్థాయిలో వెళ్లి అడిగి తెలుసుకున్నారు. 9 రకాల కేంద్ర ప్రభుత్వం పథకాల అమలు, పర్యవేక్షణ ఎలా ఉందని ఆరాతీశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, హౌసింగ్, రీసర్వే, స్వామిత్వను తదితర పథకాలను తనిఖీ చేసి ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీడీ పుల్లారెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్రబృందం సభ్యులు

# కల్వర్టులు శిథిలం.. ప్రయాణం నరకం..!

## ● ప్రతి వార్డులోనూ ధ్వంసం ● పట్టించుకోని మున్సిపల్ అధికారులు


పరిటాల శ్రీరాములు కల్యాణ మండపం వద్ద కల్వర్టు దుస్థితి, మార్కెట్ వద్ద ధ్వంసమైన కల్వర్టు

గుంతకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి వార్డులోనూ కల్వర్టులు ధ్వంసమై సమస్యగా మారాయి. కల్వర్టుల మీదుగా వెళ్లాలంటే ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో హనుమేశ్‌నగర్, గుట్ట ప్రాంతం, రాజేంద్రనగర్, పోర్టర్స్‌లైన్, మోమినాబాద్, మార్కెట్ రోడ్డు, మోదినాబాద్, పాతగుంతకల్లు, మిల్లుకాలనీ.. ఇలా పలు వార్డుల్లో కల్వర్టులు శిథిలమైపోయి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. వార్డు కౌన్సిలర్లు పలు టమార్లు కౌన్సిల్ సమావేశాల్లో మొరపెట్టుకుంటున్నా సమస్య పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు. పట్టణంలో దాదాపు 50 కల్వర్టుల వరకూ శిథిలమైపోయాయి. వాటివల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

#### పగిలిన కల్వర్టులు

హనుమేశ్ నగర్‌లోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపం వద్ద ఓ కల్వర్టు పూర్తిగా ధ్వంసమైపోగా పలువురు ద్విచక్ర వాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురయ్యారు. ఇదే వార్డులోని ఉలిగమ్మ ఆలయం వద్ద ఒక కల్వర్టు ధ్వంసమైంది. అలాగే కూరగాయల మార్కెట్ నుంచి వాసవి థియేటరుకు వెళ్లే రహదారిలోని కల్వర్టు సగం ధ్వంసమైపోవడంతో రోడ్డు కూడా చీలికలై పాడైపోయింది. ఇక్కడ కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో తాత్కాలిక అవసరం కోసం గృహ నిర్మాణాల వేస్ట్ మెటీరియల్‌ను తెచ్చి ఇక్కడ కుమ్మరించారు. అలాగే పాత బస్టాండులోని మార్కెట్ లోనూ, అక్కడి నుంచి గుజరీకి వెళ్లే చోట ఉన్న కల్వర్టులు కుంగిపోయి డ్రైయిన్లు మూసుకుపోయాయి.

#### ఫిర్యాదులతో కంఠశోష మిగిలింది



మార్కెట్ వద్ద అత్యంత జనసమ్మర్థం ఉన్న రోడ్డు కూడలిలో కల్వర్టు ధ్వంసమైపోయింది. నా వార్డులో కల్వర్టు సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశాను. కౌన్సిల్ మీట్‌లో కూడా ప్రతి నెలా అడుగుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేకుండాపోయింది. పట్టణంలో ప్రతి వార్డు నుంచి కల్వర్టులతో సమస్యగా ఉంది.

- కందూరి కృపాకర్, 21వ వార్డు కౌన్సిలర్, గుంతకల్లు

#### ఒక్కొక్కటిగా పునర్నిర్మిస్తాం

కౌన్సిలర్ల ఫిర్యాదు మేరకు పలు వార్డుల్లో ధ్వంసమైన కల్వర్టులను గుర్తించి పునర్నిర్మాణం, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అత్యవసరంగా హనుమేశ్ నగర్‌లోని ఉలిగమ్మ ఆలయం, పరిటాల శ్రీరాములు కల్యాణ మండపం వద్ద ఉన్న కల్వర్టులను పునర్నిర్మించడానికి చర్యలు చేపట్టాం. ఇతర వార్డుల్లోనూ సమస్యలను పరిష్కరిస్తాం.

-ఇంతియాజ్ బాషా, మున్సిపల్ ఇంజనీరు, గుంతకల్లు

### వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న మంత్రి కేశవ్

వజ్రకరూరు(ఉరవకొండ),ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి శ్రీరాంనగర్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ధ్వజస్తంభ, నాగప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ దాత పారావిశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీరాంనగర్ కాలనీని మంత్రి ప్రారంభించారు. అక్కడే నూతన ఆలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. శుభకార్యంలో పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పారావిశ్వనాథ్ ఆలయం నిర్మించడంతో పాటు, 84 మందికి రెండున్నర సెంట్ల చెప్పున నాలుగు ఎకరాల భూమిలో పట్టాలు ఇవ్వడం హర్షణీయం అన్నారు. ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు రేగాటి నాగరాజు, మారెన్న, మండల కన్వీనర్లు వెంకటేష్, విజయ్ భాస్కర్, నాయ కులు నాగేశ్వరరావు, కుళ్లాయప్ప, వెంకటమ్మ, నాగభూషణం, రంగప్ప చౌదరి పాల్గొన్నారు.

### పలువురికి మంత్రి పరామర్శ

ఉరవకొండ, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): గత రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సీపీఐ నాయకులు శివన్న కుటుంబసభ్యులను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పరామర్శించారు. శివన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్ట్ పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేశారన్నారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు నాగరాజు, కేశవానంద, తిమ్మప్ప ఉన్నారు.

● బెళుగుప్ప : టీడీపీ నాయకుడు ఆవులెన్న శంకర్ నారాయణ ఆకస్మిక మృతి పార్టీకి తీరనిలోటు అని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీన శంకర్ నారాయణ చనిపోయిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ.. శంకర్ నారాయణ కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని ధైర్యంగా వుండాలని సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిపత్రి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేరన్నపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి పట్టణంతోపాటు యాడికి పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

### కిందపడి వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కిందపడి ఖాసీం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. జొన్నగిరికి చెందిన ఖాసీం అనారోగ్యంతో వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. ప్రమాదవశాత్తు అతను ఆసుపత్రి వద్ద కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు.

### వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహిద్దాం

#### తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పద్ధతి ప్రకారం, ప్రశాంతంగా నిర్వహిద్దామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ప్రతి దేవాలయంపై ప్రత్యేక దృష్టిపెట్టానని, వినాయక చవితి పండుగను అందరం కలిసికట్టుగా విజయవంతంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోనే నడుచుకోవాలన్నారు. వాటిలో తాను ఒక మెంబర్ అని అందువల్ల ఈసారి ఎడాపెడా చేయకుండా పద్ధతి ప్రకారం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చానన్నారు. వినాయక మండపాలు ఎన్ని నిర్వహిస్తున్నారో ప్రతి ఒక్కరూ పేరుతో నమోదుచేసి ఉత్సవ కమిటీకి అందజేయాలన్నారు. వినాయక విగ్రహాలు ఎన్ని అడుగులు ఎత్తు తదితర వాటికి వివరాలు తెలియజేస్తే వాటి గురించి ముందుగా ఒక పద్ధతి ప్రకారంగా ముందుకు వెళ్లవచ్చు అన్నారు. ఎప్పుడూ చేయనివిధంగా ఈ ఏడాది వినాయక చవితిని జరుపుకుందామని, మీ అందరి సహకారం ఉంటే ప్రశాంతంగా చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు కత్తి రామచంద్రారెడ్డి, రాధాకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, శింగిరి లక్ష్మీనారాయణ, గంగాధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రెండిళ్లల్లో చోరీ

రాయదుర్గం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులో నివాసం ఉండే గంగమ్మ, రామాంజినమ్మ అనే మహిళల ఇళ్లల్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్లకు వేసిన తాళాలను పగులగొట్టి బంగారు, నగదును అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గంగమ్మ ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లగా, రామాంజినమ్మ బంధువుల ఊరు గడేకల్లుకు వెళ్లింది. గంగమ్మ ఇంట్లో ఉన్న 15 గ్రాముల బంగారు కమ్మలు, రూ.37 వేల నగదు, వెండి పట్టీలు, పట్టుచీరలు, రామాంజినమ్మ ఇంట్లో ఐదు తులాల బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడి ఎన్నిక

పుట్లూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడిగా మండలానికి చెందిన రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శుక్రవారం ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడతామని తెలిపారు. ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి జాఫర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా వరలక్ష్మీ వ్రతం


కళ్యాణదుర్గంలో అమ్మవారికి పట్టుచీరల అలంకరణ, యాడికిలో అలంకరణలో చౌడేశ్వరీదేవి


గుంతకల్లు, గుత్తిలో ప్రత్యేక అలంకరణలో వాసవి అమ్మవారు

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం ఇళ్లు, ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు గావించారు. ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతం చేసే సాంప్రదాయం లేనివారు సమీప ఆలయాల్లో వ్రతాలను నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వాసవి అమ్మవారికి బంగారు చీరను ధరింప చేసి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గుత్తి, గుత్తిఆర్‌ఎస్‌లో వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఉరవకొండ పట్టణంలోని దుర్గా భవాని ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం పూజలతో ఆలయం సందడిగా కనిపించింది. నూతన పట్టుచీరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బొమ్మనహాళ్ మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. యాడికిలోని చౌడేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యల్లనూరు మండలంలో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటరమణస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లోని మాత జగదాంబ దేవాలయాలలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. కణేకల్లు మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని నేసేపేటలోని మహాలక్ష్మీ ఆలయం, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న శ్రీవరమహాలక్ష్మి, సత్యనారాయణస్వామి, కోటలోని కన్యకా పరమేశ్వరి దేవాలయాలలో సామూహిక వ ర లక్ష్మీ వ్రత పూజలు చేశారు. డి.హీరేహాళ్ మండల వ్యాప్తంగా వరమహాల క్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఓబుళాపురం మహాలక్ష్మీ ఆలయంలో వ్రతం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూలు, ఆభరణాలతో అలంకరించారు.


సేవాఘడ్‌లో ప్రత్యేక అలంకరణలో మాతాజగదాంబ, బొమ్మనహాళ్‌లో అమ్మవారికి అలంకరణ, రాయదుర్గంలో ప్రత్యేక అలంకరణ

### చిత్రావతి నదికి గండికోట నీరు


యల్లనూరు కాజ్‌వే వద్ద ప్రవహిస్తున్న నీరు

యల్లనూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి నదికి గండికోట నీరు వదిలారు. పార్నపల్లి వద్ద ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల పథకం ద్వారా గండికోట నుంచి నీటిని పంపిస్తున్నారు. ఈ నీటిని చిత్రావతి పరివాహక రైతుల కోరిక మేరకు గొడ్డుమర్రి ఆనకట్ట నుంచి నదిలోకి వదిలారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నదిపరివాహక ప్రాంతాల్లో నీటిఎద్దడిని దృష్టిలో ఉంచుకొని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నీటిని వదిలించారు. ప్రస్తుతం ఈ నీరు యల్లనూరు మండల సరిహద్దును దాటి శుక్రవారం వెళుతున్నట్లు రైతులు తెలిపారు. నీరు రావడంతో పరివాహక రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కణేకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం గావించిన సందర్భంగా రెండో వార్షికోత్సవం, కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యావచనం, రక్షాబంధనం, నవకళశస్థాపన నిర్వహించారు. అనంతరం ఎదురుకోలు ఉత్సవాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరేంద్ర, సర్పంచ్ జయరాంచౌదరి, తూర్పు రఘునాథ్, దేవదాసు, గ్రామపెద్దలు హాజరయ్యారు.

### రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి


డీసీఎంఎస్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న నెట్టెం వెంకటేష్

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను అందుబాటులో వుంచాలని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని డీసీఎంఎస్ బ్రాంచ్‌ను ఆయన తనిఖీ చేశారు. డీసీఎంఎస్ కార్యాలయంలోని అధికారులను ఎరువుల ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎక్కువగా యూరియా కోసం సంప్రదిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డీసీఎంఎస్ కార్యాలయ భవనం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అవసరం మేరకు మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ విజయ భాస్కర్, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ సత్యనారాయణ, అకౌంటెంట్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆర్డీటీ పట్ల కేంద్రం వైఖరి మారాలి: ఎమ్మార్పీఎస్



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎల్‌ఆర్‌పీఎస్ నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అక్కులప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎల్‌ఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో టీ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా నిర్వహిస్తున్న నాయకులను పట్టణ పోలీసులు స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను తక్షణమే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కరువు విలయతాండవం చేస్తున్న తరుణంలో ఆర్డీటీ అనంత జిల్లాకు వరమై పేద బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అలాంటి ఉన్నతమైన సంస్థను రెన్యువల్ చేయకుండా నిలుపుదల చేయడం బీజేపీకి తగదని అన్నారు. ప్రభుత్వాలకు సమాంతరంగా బడుగు, బలహీనవర్గాలకు విద్య, వైద్యం, గృహ సదుపాయంతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను అందిస్తూ మహిళ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తున్న ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం సాధింపు చర్యలు తగవన్నారు. కార్యక్రమంలో నాయకులు మండల రమేష్, లక్ష్మణమూర్తి, ఉదయ్, మహాలింగ, రవికుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీకి అధికారంలో ఉండే అర్హత లేదు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓట్లను చోరీ చేస్తున్న బీజేపీకి కేంద్రంలో అధికారంలో ఉండే అర్హత లేదని రాయదుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గౌని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఓట్లను కూడా కల్తీ చేయడానికి నకిలీ, దొంగ ఓట్లను సృష్టించడానికి బీజేపీకి సహాయ పడుతున్నట్లుగా లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో సహా నిరూపించి బెంగళూరులో నిరసన ర్యాలీ నిర్వహించారని అన్నారు. బెంగుళూరు నగరంలోని సెంట్రల్ ఎంపీ నియోజకవర్గంలోని మహాదేవపురలో ఉన్న ఆరు లక్షల ఓట్లలో ఒక లక్షకు పైగా ఓట్లు దొంగ ఓట్లని రుజువు చేయటానికి ఆరునెలల పట్టిందని తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో కూడా ప్రజలకు బాసటగా ఒక న్యాయవాదుల బ్యాంకును త్వరలోనే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌని రాఘవేంద్రరెడ్డి, బిలాల్, అనిల్, జీ మహబూబ్‌బాషా, వసంతకుమార్‌గౌడ్, అయూబ్‌ఖాన్, మంజు పాల్గొన్నారు.